సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 1 । మార్చి । 2023



చల్లంగా చూడు తల్లీ

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం సమర్పించారు. చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు.



ఆదాయం లెక్కింపు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి హుండీని మంగళవారం లెక్కించారు. గతేడాది డిసెంబర్ 9 నుంచి ఈ ఫిబ్రవరి 28 వరకు రూ.41,34,313 నగదు సమకూరింది.

గరిష్టం/కనిష్టం
35.0/18.0

వాతావరణం

ఆకాశం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అగ్రస్థానం



ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ అభినందనలు

సిరిసిల్ల: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ విభాగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ర్యాంకులను మంగళవారం వెల్లడించింది. దేశంలో 550 జిల్లాలు ఉండగా, 2023 త్రైమాసిక ఫలితాల్లో రాజన్న సిరిసిల్ల మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్ జిల్లా నిలువగా, మూడో స్థానంలో పెద్దపల్లి నిలవడం విశేషం. రాజన్న సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బందిని మంత్రి కేటీఆర్ మంగళవారం ట్విట్టర్ వేదికగా అభినందించారు. సమష్టి కృషితో జిల్లాను అగ్రస్థానంలో నిలుపారని, ఇది మనందరికీ గర్వకారణమని మంత్రి కేటీఆర్ వివరించారు. మొదటి ర్యాంకు రావడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి



సైన్స్ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ తదితరులు

సిరిసిల్లఅర్బన్: విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం వెంకంపేట పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. దేశాభివృద్ధికి సైన్స్ మూలం అని, విద్యార్థులు చదువుతో పాటు శాస్త్రీయ విజ్ఞానంలో ముందుండాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆవిష్కరించిన పలు స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, కౌన్సిలర్ కల్లూరి రాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ వీరబత్తిని కమలాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తంగళ్లపల్లి మండంలోని అంకుశాపూర్, ఒబులాపూర్ పాఠశాలల్లో సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాళ్లపల్లి శ్రీధర్, బండి ఉపేందర్, సర్పంచ్ కొయ్యాడ ఎల్లవ్వ, ఎంపీటీసీ కుంటయ్య తదితరులు విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు.

టెక్స్‌టైల్ విద్యార్థులకు అవగాహన



హరిప్రసాద్ రూపొందించిన జీ- 20 లోగో

వేములవాడఅర్బన్: మండలంలోని అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని టెక్స్‌టైల్ విద్యార్థులకు సిరిసిల్లకు చెందిన యువ నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ బట్టల తయారీపై అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ జాకర్డ్ యంత్రంపై ఎలా డిజైన్ చేయాలి, డిజైన్ ప్లానింగ్, పవర్‌లూమ్ ద్వారా బట్టలు తయారు చే యడం వంటి అంశాలను వివరించారు. అలాగే తాను రూపొందించి, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ ద్వారా ప్రశంసించిన జీ-20 శిఖరాగ్ర సదస్సు లోగోను, అగ్గిపెట్టెలో ఇమిడే చీరను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా గుర్తింపు తెచ్చుకోవాలి



ఇంటింటా ప్రచారం చేస్తున్న అధికారులు

చందుర్తి(వేములవాడ): ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా గుర్తింపు తెచ్చుకునే బాధ్యత గ్రామాల ప్రజలపైనే ఉందని స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ సురేశ్ అన్నారు. మండలంలోని మూడపల్లి రైతు వేదికలో స్వచ్ఛ భారత్ మిషన్ రెండో విడత శిక్షణ తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. కిరాణ షాపులు, హోటళ్లు, చికెన్, మటన్ సెంటర్‌లలో ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో చందుర్తి, రుద్రంగి ఎంపీడీఓలు రవీందర్, శంకర్‌నాయక్, ఎంపీఓలు ప్రదీప్, సుధాకర్, ఏపీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంతో పోటీపడాలి

- ట్యాబ్‌లతో ఐఐటీ, నీట్ ఎంట్రన్స్‌కు సిద్ధం కావాలి
- రాష్ట్ర ఐటీ మంత్రి కె.తారకరామారావు
- రెండువేల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత
- ఎల్లారెడ్డిపేటలో వృద్ధుల సంక్షేమ కేంద్రం.. జీపీ భవనాలు ప్రారంభం
- సిరిసిల్లలో 400 మందికి డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ



ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు సూచనలు చేస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు ఐఐటీ, నీట్ ఎంట్రన్స్‌లతోపాటు ఇతర రంగాల్లో మంచి ర్యాంకులు సాధించి, ప్రపంచంతో పోటీపడే పౌరులుగా తయారుకావాలనే ఉద్దేశంతో ట్యాబ్‌లు అందజేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీ మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన బహిరంగసభలో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 2 వేల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

- ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ట్యాబ్‌లను సమర్థవంతంగా చదువుల్లో రాణించేందుకు వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు.
- ఇందులో ఇంటర్నెట్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ వంటి అడ్డమైన కార్యక్రమాలు చేయొద్దన్నారు.
- సిరిసిల్ల నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.25.80 కోట్ల విలువ చేసే 3 వేల ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు.
- రానున్న రోజుల్లో వేములవాడ నియోజకవర్గంలో మరో 3 వేల ట్యాబ్‌లను అందిస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధిలో ముందుకు..

ఎల్లారెడ్డిపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ముందుకుపోతున్నామని మంత్రి పేర్కొన్నారు. స్థానికంగా రూ.7కోట్లతో జెడ్పీ ఉన్నత పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. జూనియర్ కళాశాల మైదానాన్ని మినీస్టేడియంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని రూ.2కోట్లతో పునరుద్ధరిస్తామని వివరించారు. ఒక్కో గ్రామపంచాయతీకి రూ.23.50 లక్షలతో ఆధునిక భవనాలు నిర్మించామన్నారు. అనంతరం మండలంలోని రాగట్లపల్లి, రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్ గ్రామపంచాయతీ భవనాలను, రాచర్లబొప్పాపూర్‌లో రైతు వేదికను మంత్రి ప్రారంభించారు. అనంతరం రాచర్లగొల్లపల్లిలో శ్రీరేణుకా ఎల్లమ్మ సిద్ధోగం వేడుకల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

అదృష్టంగా భావిస్తున్న

మంత్రి కేటీఆర్ ఎదుట మాట్లాడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని ఎల్లారెడ్డిపేట ఎంపీపీ పిల్లి రేణుక భావోద్వేగానికి గురయ్యారు. ట్యాబ్‌ల పంపిణీలో ఆమెకు మాట్లాడే అవకాశం వచ్చింది. 'వ్యవసాయ పనులు చేసుకునే నేను మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో ఎంపీపీనయ్యాను. ఇలా రామన్నను చూసేసరికి కడుపునిండి, మాటలు రావడం లేదు' అని అన్నారు. ఎంపీపీ ప్రసంగంపై మంత్రి అభినందించారు.

సౌలత్‌లు మంచిగున్నయ్



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

- రాష్ట్రంలోనే తొలిసారిగా ఎల్లారెడ్డిపేటలో ఏర్పాటు చేసిన వృద్ధుల సంరక్షణ కేంద్రంలో సౌలత్‌లు మంచిగున్నాయని మంత్రి కేటీఆర్ కలెక్టర్ అనురాగ్ జయంతిని అభినందించారు. రూ.40 లక్షలతో 25 బెడ్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రంలో చేరిన వృద్ధులను మంత్రి ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాసేపు వృద్ధులతో టేబుల్‌టెన్నిస్, క్యారమ్స్ ఆడారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు.

అర్హులందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యత నాదే



డబుల్ బెడ్రూం పట్టా అందిస్తున్న మంత్రి

'సిరిసిల్లలో అన్ని అర్హతలు ఉండీ.. డబుల్ బెడ్రూం ఇల్లు రాని పేదలను ఏ ఒక్కరిని విడిచిపెట్టకుండా ఇల్లు మంజూరు చేసే బాధ్యత నాది.. ఆ బాధ్యతను వ్యక్తిగతంగా నేను తీసుకుంటా' అని మంత్రి కేటీఆర్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం 400 మంది పేదలకు మండెపల్లిలోని డబుల్ బెడ్రూం పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. సిరిసిల్లలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఆరువేల మంది దరఖాస్తు చేసుకోగా, అర్హులు 2,788 మంది ఉన్నట్లు తేలిందన్నారు. మండెపల్లిలో 1,260, పెద్దూరులో 516, శాంతినగర్‌లో 204, రగుడులో 50 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించామని వివరించారు. మొత్తం 2,052 ఇళ్లు ఉండగా, ఇంకా 726 మంది పేదలు మిగిలిపోయారని, వారికి డ్రాలో ఇల్లు దక్కలేదన్నారు. వారికి ఇల్లు మంజూరు చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. జాగా ఉన్నవారు ఇల్లు కట్టుకోడానికి రూ.3 లక్షలు ఇస్తామని, జాగా లేనివారికి స్థలం ఇచ్చి ఇల్లుకు డబ్బులు ఇస్తామని మంత్రి వెల్లడించారు. సిరిసిల్ల కార్మిక వాడల్లో క్రయ, విక్రయాలకు ప్రభుత్వం జీవో ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, డీఐజీ రమేశ్‌నాయుడు, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్‌లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, డీఈవో రమేశ్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, కమిషనర్ వి.సమ్మయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బంధువులను పరామర్శించిన మంత్రి



పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మోహినికుంటకు చెందిన కల్వకుంట్ల చక్రధర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను మంత్రి కేటీఆర్ మంగళవారం పరామర్శించారు. చక్రధర్‌రావు సతీమణి పరంధామ, కుమారుడు వరప్రసాద్ రావులను ఓదార్చారు. మంత్రి వెంట రైతు బంధు సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్ రావు, సర్పంచ్ కల్వకుంట్ల వనజ, ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, శ్రీనివాస్‌రావు, యాదగిరిగౌడ్, రాజేశంగౌడ్ తదితరులున్నారు.

శాశ్వత సాగునీటిని అందిస్తాం

బందనకల్, వెంకట్రావుపల్లి గ్రామాలకు మల్లన్నసాగర్ ద్వారా శాశ్వత నీటిని అందిస్తామని మంత్రి అన్నారు. మోహినికుంటకు వచ్చిన మంత్రిని రెండు గ్రామాల ప్రజాప్రతినిధులు కలిసి సాగు నీటి సమస్యను వివరించారు. రంగనాయకసాగర్ నుంచి మాచాపూర్ వరకు వచ్చే నీటిని రెండు గ్రామాలకు తీసుకువచ్చేలా చూడాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి ఎస్‌ఈతో మాట్లాడారు. పులిచెరువు, ఊర చెరువులకు నీరు ప్రస్తుతం అందేలా చూస్తామన్నారు. సేవాలాల్‌తండా, తెర్లుమద్ది, పోతుగల్‌కు మానేరు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. కాగా ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది తమను రెగ్యులర్ చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.

డీఎల్‌పీవో మల్లికార్జున్ సస్పెన్షన్

- విచారణకు ఆదేశించిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- విచారణ అధికారిగా జిల్లా ఆడిట్ అధికారి
- మార్చి 2న విచారణకు ఆదేశాలు



'సాక్షి'లో ఫిబ్రవరి 22న ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా డివిజనల్ లెవల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) రాగంపేట మల్లికార్జున్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారుల వద్ద డబ్బులు వసూలు చేస్తూ.. వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పేర్కొంటూ ఫిబ్రవరి 22న 'సాక్షి'లో 'అవినీతికి చెకింగ్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రాథమిక విచారణ జరిపిన కలెక్టర్ ప్రొసిడింగ్ నంబరు: ఏ3/212/2023 ద్వారా డీఎల్‌పీవోను సస్పెండ్ చేశారు. సమగ్ర విచారణ కోసం జిల్లా ఆడిట్ అధికారి స్వరూపను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆడిట్ అధికారి మార్చి 2న ఉదయం 11.30 గంటల నుంచి పంచాయతీ కార్యదర్శులు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి గ్రామాల సర్పంచ్‌లు విచారణకు వచ్చి డీఎల్‌పీవో అవినీతి, వేధింపులపై వాంగ్మూలం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు నోటీస్ జారీ చేశారు. డీఎల్‌పీవో క్షేత్రస్థాయిలో తనిఖీలకు వెళ్తూ, ఏదో కారణాన్ని చూపుతూ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. వేములవాడ రూరల్ మండలంలోని ఓ సర్పంచ్ వద్ద రూ.15వేలు తీసుకుని, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో వాపస్ ఇచ్చినట్లు ఆధారాలతో సహా దొరకిపోవడం గమనార్హం.

రాయభేరాలు

మార్చి 2న జిల్లా ఆడిట్ అధికారి వద్ద విచారణ ఉండడంతో డీఎల్‌పీవో మల్లికార్జున్ రాయభేరాలు ప్రారంభించారు. డబ్బులు ఇచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులను బతిమిలాడుతూ విచారణకు రావద్దని వేడుకుంటున్నాడు. తనకు కొద్ది నెలలే సర్వీసు ఉందని, ఈ దశలో ఇబ్బందులకు గురి చేయొద్దని, మీరు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తానంటూ సదరు ప్రజాప్రతినిధుల వద్దకు, అధికారుల ఇళ్లకు వెళ్లడం గమనార్హం. ఏది ఏమైనా డివిజనల్ స్థాయి అధికారి పంచాయతీరాజ్ చట్టంలో ఉన్న లొసుగులను ఆధారం చేసుకుని క్షేత్రస్థాయిలో తనిఖీల పేరిట బెదిరించి వసూళ్లకు పాల్పడడం జిల్లాలో చర్చనీయాంశమైంది. మార్చి 2న విచారణ ఎలా జరుగుతుందో వేచి చూడాలి.

పట్టణాభివృద్ధికి పట్టం

- ప్రణాళిక బద్ధంగా పనులు
- మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి
- హరితహారానికి ప్రత్యేక నిధులు
- రూ.78.99 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సిరిసిల్ల మున్సిపల్ వార్షిక బడ్జెట్ తయారైందని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన 2023-24 వార్షిక బడ్జెట్ సమావేశంలో మాట్లాడారు. రూ.78.99 కోట్ల బడ్జెట్ తయారైందని ఈ నిధులను ప్రణాళికబద్ధంగా వినియోగిస్తూ పట్టణాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పదిశాతం నిధులు హరితహారం కార్యక్రమానికి కేటాయించడాన్ని అభినందించారు. మున్సిపల్ పన్నులను నూరుశాతం వసూలు చేయాలని, పట్టణంలో టీఎస్‌బీపాస్ ద్వారా నిర్మాణాలకు నిర్ణీత సమయంలో అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. విలీన గ్రామాల అభివృద్ధికి బడ్జెట్‌లో 1/3వంతు కేటాయించినట్లు పేర్కొన్నారు.

పట్టణావసరాలకు అనుగుణంగా..

మున్సిపల్ బడ్జెట్‌ను చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షత న ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ..రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న సిరిసిల్ల పట్టణావసరాలకు అనుగుణంగా కొత్త బడ్జెట్ తయారు చేశామన్నారు. పట్టణంలోని మురికివాడల్లో మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. విలీన గ్రామాలకు 1/3 నిదులు కేటాయిస్తామని, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మిగులు బడ్జెట్.. అప్పుల్లోకి ఎలా..?

గతేడాది రూ.89లక్షల వరకు మిగులు బడ్జెట్ ఉండగా, ఈఏడాది బడ్జెట్‌ను రూ.1.05 కోట్ల అప్పు చూపెట్టడం ఏంటని బీజేపీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ ప్రశ్నించారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. మిగులు బడ్జెట్‌ను అప్పుల్లోకి నెట్టిన ఘనత ఈపాలకులకే దక్కిందని, దీనిపై ప్రజలకు సమాధానం ఇవ్వాలన్నారు. గతేడాది మాదిరిగానే అభివృద్ధి తదితర అంశాలకు ఒకేలా నిధులు కేటాయించినా.. అప్పుల బడ్జెట్ ఎలా వచ్చిందని విమర్శించారు.

కేటీఆర్ సారూ.. ఇదేం వివక్ష..?



కేటీఆర్‌కు వ్యతిరేకంగా నాగరాజు నిరసన దీక్ష

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ ఇలాకాలో ప్రతిపక్షాల కౌన్సిలర్ల వార్డులపై అధికార పార్టీ నాయకులు వివక్ష చూపుతున్నారని సిరిసిల్లకు చెందిన బీజేపీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ విమర్శించారు. మంగళవారం సిరిసిల్లలో కేటీఆర్ పర్యటన సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన దీక్ష చేపట్టి మాట్లాడారు. పట్టణంలోని 39 వార్డులు ఉండగా 38 వార్డులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు అందించి కేవలం తమ 10వ వార్డుకు ఒక్కటి కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయం గతంలో చాలాసార్లు అధికారులు, చైర్‌పర్సన్, మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, అయినా తమ వార్డుకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వడం లేదన్నారు. తమ వార్డులోని పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు అందించి న్యాయం చేసే వరకు తాను పోరాడుతానని స్పష్టం చేశారు. కౌన్సిలర్‌తో టౌన్ సీఐ అనిల్‌కుమార్ మాట్లాడి నిరసన దీక్ష విరమణ చేయించారు.

కోనరావుపేట మోడల్ జీపీకి రూ.50 లక్షలు

సిరిసిల్ల: జిల్లాలోని కోనరావుపేట మండల కేంద్రంలో మోడల్ గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు అయ్యాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు కోనరావుపేట మండల పర్యటనకు వచ్చినప్పుడు స్థానిక సర్పంచ్ పోకల రేఖ మోడల్ గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. వేదికపై నిధుల మంజూరుకు మంత్రి హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.50లక్షలు మంజూరు పత్రాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణకు మంత్రి కేటీఆర్ ఎల్లారెడ్డిపేట సభలో అందించారు.

సీఎంఆర్.. ఇదేం తీరు?

- గడువు మీద గడువు పెంపు
- అయినా అందని బియ్యం
- 100 శాతం మిల్లింగ్‌పై సందేహాలు
- ప్రభుత్వ ధాన్యంతోనే దందా
- నామమాత్రపు పర్యవేక్షణ.. చర్యలు కరువు



ఏడాది క్రితం రామడుగులో అక్రమం వెలుగుచూసిన మిల్లు ఇదే

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: గడువుల మీద గడువు పెంచుతున్నా మిల్లర్లలో మార్పులేదు. పలువురు మిల్లర్లు మరాడించిన బియ్యాన్ని వక్రమార్గం పట్టిస్తుండగా కఠినచర్యలు కరువవడం ఆందోళనకర పరిణామం. ఏళ్లుగా బకాయి ఉన్న మిల్లర్లు ఉండగా ఇంకా సదరు వసూలులో ఎనలేని నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మరాడించి బియ్యంగా ఇవ్వాలని రైస్‌మిల్లులకు సరఫరా చేయడం ప్రతి యాసంగి, వానాకాలం సీజన్‌లో జరిగే తంతు. అధికారులతో ఉన్న అనుబంధమో మరేమో కానీ పలు మిల్లులు ఇంకా సీఎంఆర్ ఇవ్వడంలో అట్టడుగున ఉండటం శోచనీయం. మంగళవారంతో గడువు ముగిసిన నేపథ్యంలో మిలర్లు వందశాతం మిల్లింగ్ చేసి ఇస్తారా? అన్నది అనుమానమే. మళ్లీ గడువు పెంపుపైనే పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.

పెట్టుబడి లేని దందా

ఉమ్మడిజిల్లాలో పలు రైస్‌మిల్లులు రేషన్‌బియ్యానికి అడ్డాగా మారాయి. రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటిలోనే కర్నెల్స్ కలిపి ఎఫ్‌సీఐకి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కేటాయించిన సీఎంఆర్ లక్ష్యం మేరకు బియ్యాన్ని అప్పగిస్తే దందా చేసుకునేందుకు అవకాశముండదు. ఒకవేళ మిల్లులో తనిఖీలు జరిగితే డొల్లతనం బయటపడుతుందన్న కారణంతో సదరు కిటుకును ఉపయోగించి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ సొమ్ముతో దర్జాగా దందా చేస్తుండగా మిల్లర్లకు కాసుల వర్షం కురుస్తోంది. గతంలో కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని ఓ రైస్‌మిల్లుకు ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యమే లేకపోవడాన్ని గుర్తించి అధికారులు కంగుతిన్నారు. ఒక ఏసీకేకు 270 క్వింటాళ్లు కాగా 14 ఏసీకేలకు గానూ 3,780 క్వింటాళ్లు. 14 ఏసీకేలకు గానూ క్వింటాల్ ధాన్యం లేకపోవడం.. రికార్డులను తరచిచూస్తే ఎఫ్‌సీఐకి సరఫరా చేసిన బియ్యమే లేకపోవడంతో నిర్ఘాంతపోవడం అధికారుల వంతయ్యింది.

మరో రెండు రోజుల్లో మరాడించి ఇస్తారా?

ఒక సీజన్‌కు సంబంధించిన కోటాను తర్వాతి సీజన్ సరుకు చేతికందే నాటికి పూర్తి చేయాలి. కానీ ప్రభుత్వం వివిధ కారణాలతో గడువు పొడిగిస్తుండటం మిల్లర్లకు లాభిస్తోంది. కేటాయించిన సీఎంఆర్ ప్రకారం వందశాతం సరఫరా చేయాలని ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించింది. గత నెల రోజుల క్రితం మరోసారి అవకాశమిస్తూ ఫిబ్రవరి 28 వరకు తుది గడువుగా పేర్కొన్నారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల అధికారులు ఈ మేరకు జిల్లా స్థాయిలో మిల్లర్లతో సమీక్షలు నిర్వహిస్తున్నా మార్పు అంతంతే. మార్చి నెలాఖరు నాటికి యాసంగి ధాన్యం చేతికందనుండగా ఆ లోపు సీఎంఆర్ పూర్తవడం కష్టమే.

కేసులైనా మార్పేదీ..

2011-12 నుంచి 2014-16 వరకు ఉమ్మడి జిల్లా పరిధిలో 18మిల్లులు సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన 90,407 క్వింటాళ్ల బియ్యాన్ని ఇవ్వలేదు. సదరు మిల్లులపై పౌరసరఫరాలశాఖ గతంలోనే కేసులు నమోదు చేయించింది. కేసులు నమోదై ఏళ్లు గడుస్తున్నా ఒక్క మిల్లరు బకాయి సీఎంఆర్ ఇవ్వకపోవడం పర్యవేక్షణ తీరుకు తార్కాణం. రెవెన్యూ రికవరీ(ఆర్‌ఆర్) యాక్ట్ ప్రయోగిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినా మిల్లర్లలో మార్పు లేదు. సదరు యాక్ట్ కింద మిల్లుల ఆస్తుల వేలం వేసైనా ఆ మొత్తం వసూలు చేయొచ్చు. కాగా సీఎంఆర్ బకాయిలను వసూలు చేస్తామని, కోర్టుకు వెళ్లడం వల్ల ఆలస్యమవుతోందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

గాడి తప్పిన పర్యవేక్షణ

2019 వానాకాలంలో సీఎంఆర్ కోటా పూర్తి చేయని మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టారు. ఉమ్మడి జిల్లాలోని పలు మిల్లుల్లో ధాన్యం మాయంచేయగా సదరు డబ్బులు చెల్లించడంతో బ్లాక్‌లిస్ట్ నుంచి బయటపడ్డాయి. నాలుగు జిల్లాల్లో సుమారు 350 మిల్లులు ఇంకా బకాయిలు ఉన్నాయి. 10 ఏసీకేల నుంచి 20 ఏసీకేల వరకు మిల్లులు బకాయి ఉండటం పర్యవేక్షణ తీరుకు అద్దం పడుతోంది. సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాల్సి ఉండగా అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు. పలుకుబడి మిలర్లు సీఎంఆర్‌తో వ్యాపారం చేస్తున్నట్లు పౌరసరఫరాల విజిలెన్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పలుమార్లు వెల్లడైంది.

ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ తీరిలా (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	లక్ష్యం	బకాయి
కరీంనగర్	2,65,228	43,729
పెద్దపల్లి	3,95,431	54,938
జగిత్యాల	1,01,480	36,377
రాజన్న సిరిసిల్ల	98,456	15,403

క్లుప్తంగా

రాజన్నను దర్శించుకున్న సినీనటి జీవిత



జీవితకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న పర్యవేక్షకుడు తిరుపతి రావు

వేములవాడ : వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని సినీనటి జీవిత మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఆలయ అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు తిరుపతిరావు, శ్రీరాములు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



రమేశ్‌కు పర్సును అప్పగిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన రమేశ్ తన పర్సును పోగొట్టుకోగా పోలీసులు అందజేశారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయ రోడ్డులో రమేశ్ అనే వ్యక్తికి చెందిన పర్సు పడిపోయింది. మంగళవారం మంత్రి కేటీఆర్ పర్యటనలో భాగంగా బందోబస్తులో ఉన్న కానిస్టేబుల్‌కు పర్సు కనిపించింది. అందులో ఉన్న ఫొటో అడ్రస్ ఆధారంగా అతడిని పిలిపించి ఏఎస్ఐ కిషన్‌రావు రమేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్‌ను సీఐ మొగిలి, ఎస్సై శేఖర్, ఏఎస్ఐ కిషన్ రావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడ్డ భిక్షపతి

కథలాపూర్(వేములవాడ): కోరుట్ల– వేములవాడ మార్గంలోని కథలాపూర్ మండలం ఇప్పపెల్లి శివారులో మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు కథనం ప్రకారం.. మెదక్ జిల్లా చిన్నకోడూర్ మండలం రామంచ గ్రామానికి చెందిన రాచకొండ భిక్షపతికి ఈ ప్రమాదంలో కాలు, చేయి విరిగి తీవ్రగాయాలయ్యాయి. భిక్షపతి తన స్వగ్రామం నుంచి మేడిపెల్లి మండలం మన్నెగూడెంలో ఉంటున్న తన సోదరి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో ఇప్పపెల్లి శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భిక్షపతి చేయి, కాలు విరిగింది. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం జగిత్యాల ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

ఋణాలు ఇవ్వబడును

■ ఎలాంటి ఆస్తి పత్రాలు లేకున్నా స్వంత ఇల్లు కలిగి ఆధార్, పాన్ కార్డు వున్న ప్రతి వారికి అతి తక్కువ వడ్డీతో ఋణాలు ఇప్పించబడును. సెల్: 9014653011 [K-1219964]

మూలికావైద్యం

■ అంగస్తంభన లేకపోవటం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేకపోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికాఔషధం, వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా.సి.హెచ్. రామకృష్ణ, VJA. ఫోన్: 84650 56299 [V-5638]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేల వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781850]

■ పనివారు కావలెను. హైదరాబాద్, భువనగిరిలో గల చిన్న కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంటపని, ఇంటిపని, డ్రైవింగ్, గార్డెనింగ్ మొ॥ పనులు చేయుటకు భార్యాభర్తలు కావలెను. డి.బాలాజీ, భువనగిరి. ఫోన్: 92469 69042, 98481 75211 [V- 1767]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

మహిళా సంఘాలకు 'సౌర' యూనిట్లు

- మండలానికి 300 చొప్పున లక్ష్యం
- స్త్రీనిధి ద్వారా సభ్యులకు సబ్సిడీ రుణాలు
- తప్పనున్న విద్యుత్ బిల్లుల భారం



సోలార్ యూనిట్లపై అవగాహన కల్పిస్తున్న ఐకేపీ అధికారులు

గంభీరావుపేట (సిరిసిల్ల): విద్యుత్ బిల్లులు, ఖర్చుల భారాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సౌరవిద్యుత్ యూనిట్ల ఏర్పాటుపై దృష్టిసారించింది. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవకాశం కల్పిస్తుంగా ఇందుకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందించనుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లులు భారంగా మారుతున్నాయి. దీంతో బిల్లుల భారం తగ్గించుకోవడంతో పాటు సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, అదనపు ఆదాయం సమకూర్చుకునేలా సౌరవిద్యుత్ యూనిట్లపై సర్కారు దృష్టిసారించింది. డీఆర్డీఏ అధికారులు గ్రామీణ మహిళా సంఘాల సభ్యులకు వాటి ఏర్పాటు, ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఒక్కో మండలానికి 300 యూనిట్లు

జిల్లాలో 12 మండలుండగా ఒక్కో మండలానికి 300 యూనిట్లను ఏర్పాటు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. టీఎస్ రెడ్కో, ప్రభుత్వం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది.

ఆర్‌సీసీ ఇళ్లు ఉండాలి..

సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు కోసం సభ్యురాలు ఆర్‌సీసీ ఇల్లు కలిగి ఉండాలి. దానిపై 160 నుంచి 200 చదరపు అడుగుల డాబా ఉండాలి. నెలవారీ గృహావసరాలకు వినియోగించే విద్యుత్ యూనిట్ల ఆధారంగా 2 కిలోవాట్స్ లేదా 3 కిలోవాట్స్ నిర్ణయిస్తారు. ఇంటి అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇచ్చి, అవసరమైనప్పుడు అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు వీలుంటుంది.

వ్యారంటీ 25 ఏళ్లు..

సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా సబ్సిడీ రుణాలు అందించనుండగా యూనిట్ ఏర్పాటు చేసినవారికి వీటిని మంజూరు చేస్తారు. మహిళలు కేంద్రం నిర్దేశించిన కంపెనీల్లో మాత్రమే యూనిట్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. వాటికి 25 ఏళ్ల వ్యారంటీ ఉండగా తీసుకున్న రుణం ఐదేళ్లలో తీరుతుంది.

సోలార్ యూనిట్ వివరాలు..

యూనిట్ కెపాసిటీ	ప్రాజెక్టు విలువ (రూ.లలో)	సబ్సిడీ (రూ.లలో)	దరఖాస్తు రుసుము	స్త్రీనిధి రుణం	ఈఎంఐ
2 కిలోవాట్స్	1,42,200	39,200	2,360	రూ.లక్ష	2,243
3 కిలోవాట్స్	1,92,360	57,360	3,450	1,25,000	2,803

అవగాహన కల్పిస్తున్నాం..



ఇళ్లపై సౌరవిద్యుత్ యూనిట్ ఏర్పాటు ప్రాధాన్యంపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. యూనిట్ ఏర్పాటుకు అందించే రుణాలు, సబ్సిడీ గురించి వివరిస్తున్నాం. విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.

– సుదర్శన్, ఐకేపీ ఏపీఎం, గంభీరావుపేట

ప్రతి గుండెను కదిలించే 'బలగం'



బలగం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- ప్రజాదరణ పొందాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్ష
- అట్టహాసంగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లవాసి తొలిసారి దర్శకత్వం వహించి రూపొందించిన బలగం సినిమా ప్రతి గుండెను కదిలిస్తుందన్న ఆశాభావాన్ని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో తొలిసారిగా బలగం చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మంగళవారం బతుకమ్మ ఘాట్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కేటీఆర్ హాజరై మాట్లాడారు. చిత్ర నిర్మాణంలో కీలక పాత్రలు పోషించిన తారాగణాన్ని, సాంకేతిక బృందాన్ని అభినందించారు. స్వరాష్ట్ర సాధన తరువాత సాంస్కృతిక పునరుజ్జీవనం జరిగి ఎంతో మంది అజ్ఞాత కళాకారులు వెండి తెరపై తమ సామర్థ్యాన్ని చాటుకుంటున్నారన్నారు. అవహేళనకు గురైన తెలంగాణ భాష, యాసలు ప్రస్తుతం పాపులర్ హీరోలు సైతం సినిమాల్లో ప్రయోగించడం తెలంగాణ రాష్ట్రంలోనే సాధ్యమైందని వెల్లడించారు. షూటింగ్‌లకు అనువైన, అందమైన లొకేషన్లు సైతం అభివృద్ధిలో భాగంగా రూపుదిద్దుకోవడం అభినందనీయం అన్నారు. త్వరలోనే విడుదలయ్యే సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈవెంట్‌లో చిత్ర నిర్మాత దిల్ రాజు, దర్శకుడు వేణు ఎల్దండి, నటీనటులు సిద్దు జొన్నలగడ్డ, ప్రియదర్శి, కావ్యతో పాటు బుల్లితెర తారలు చమ్మక్ చంద్ర, సుడిగాలి సుధీర్, రాంప్రసాద్, రచ్చ రవి ఇతర తారాగణం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్, కొండూరి రవీందర్‌రావు, జెడ్పీ, మున్సిపల్ చైర్ పర్సన్లు న్యాలకొండ అరుణ, జిందం కళ, టీఆర్ఎస్ నాయకులు, వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాన్ని కాపాడుకుంటాం



సిబ్బందిపై చర్యలు తీసుకొని, అటవీ ప్రాంతాన్ని కాపాడాలని నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

- పది ఎకరాలకు పైగా చెట్లు నరికివేత
- ఫారెస్టు సిబ్బందికి సమాచారమిచ్చినా స్పందించడం లేదు
- లింగంపేట గ్రామస్తుల ఆగ్రహం



అటవీ ప్రాంతంలో నరికివేతకు గురైన చెట్లను పరిశీలిస్తున్న గ్రామస్తులు

చందుర్తి (వేములవాడ): అటవీ ప్రాంతాన్ని రక్షించాల్సిన ఆ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అటవీ భూమిని కాపాడుకుంటామని మండలంలోని లింగంపేట గ్రామస్తులు మంగళవారం కదంతొక్కారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. లింగంపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కొందరు అక్రమార్కులు చెట్లను నరికి వేస్తూ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారన్న సమాచారంతో గ్రామస్తులు ఏకమై అటవీప్రాంతానికి తరలి వెళ్లారు. భూమిని సాగు చేసుకునేందుకు చెట్లను నరికిన ప్రాంతాన్ని పరిశీలించారు. సుమారు 10 ఎకరాలకుపైగా సాగుకు సిద్ధం చేశారంటూ ఆరోపించారు. చెట్లను నరికివేస్తున్నారని అటవీ శాఖ సిబ్బందికి ఎన్నిసార్లు సమాచారమిచ్చినా పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ భూమిని కాపాడే చిత్తశుద్ధి ఆ శాఖ అధికారులకు ఉంటే వెంటనే పండ్ల మొక్కలు నాటించి అటవీ ప్రాంతాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. అక్రమార్కులతో చేతులు కలిపిన అటవీ సిబ్బందిని ఉన్నతాధికారులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే జిల్లా కలెక్టర్‌తో పాటు అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దప్పుల లక్ష్మి, ఉపసర్పంచ్ ముకుందరావు, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, ఆకుల ఎల్లయ్య, ఈగ రాజేశం, తర్రె లక్ష్మణ్, శ్రీరాములు నారాయణ, గుడిసే నర్సయ్య, గుడిసే రాజయ్య, మారుపాక పెద్ద ఎల్లయ్య, మారుపాక వెంకటి, దొకే రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశానికి స్వపక్ష కౌన్సిలర్ల గైర్హాజరు

- ప్రతిపక్ష కౌన్సిలర్లను ప్రాధేయపడిన చైర్‌పర్సన్ భర్త
- ఎట్టకేలకు ముగిసిన మున్సిపల్ సమావేశం



సమావేశంలో చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ అన్వేశ్

వేములవాడ: ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు ప్రతినెలా సమావేశమయ్యే మున్సిపల్ పాలకవర్గంలో ఈసారి కాస్త గందరగోళం నెలకొంది. చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి స్వపక్ష బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో ఆందోళనకు గురైన చైర్‌పర్సన్ భర్త రాజు కౌన్సిలర్లకు పర్సనల్‌గా ఫోన్లు చేసి సమావేశానికి రావాలని ఆహ్వానించారు. ససేమిరా వినని స్వపక్ష కౌన్సిలర్లు రాకుండా ఉండిపోయారు. చైర్‌పర్సన్ భర్త ఏకపక్ష నిర్ణయాలు, చేసిన పనులకు బిల్లులు పెట్టుకుని డబ్బులు తీసుకోవడం, టెండర్లు లేకుండానే పనులు కేటాయించడం, ఎజెండా అంశాలను చర్చించకుండానే నేరుగా సమావేశంలో ప్రవేశపెట్టడంలాంటి చర్యలపై స్వపక్ష, విపక్ష కౌన్సిలర్లు కొంతకాలంగా ఫైర్ అవుతున్నారు. దీంతో స్వపక్ష కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కావద్దని తెగించి ఉండిపోయారు.

16 మంది సభ్యులతో..

మున్సిపల్ సమావేశం ప్రారంభానికి సరైన కోరం లేకపోవడంతో ముందుగా స్వపక్ష కౌన్సిలర్లను రావాలని చైర్‌పర్సన్ భర్త కోరారు. వారు రాకపోవడంతో ప్రతిపక్ష కౌన్సిలర్లకు సైతం ఫోన్లు చేసి సమావేశానికి రావాలని కోరారు. ఈ క్రమంలో మున్సిపల్ కార్యాలయ వరండాలో కూర్చున్న బీజేపీ కౌన్సిలర్లను సమావేశ మందిరంలో రావాలంటూ ప్రాధేయపడ్డారు. చివరకు 16 మంది సభ్యులతో సమావేశం కొనసాగించారు. 32 ఎజెండా అంశాలతో చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

సిరిసిల్ల అర్బన్ : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఒబులాపూర్ గ్రామానికి చెందిన కొట్టవర్ సాయన్న (70) అనే వృద్ధుడు కొన్ని రోజుల కింద తంగళ్లపల్లి మండలంలోని సారంపల్లిలో నివాసముంటున్న కూతురింటికి వచ్చాడు. మంగళవారం ఉదయం ఎదురింటికి వెళ్లేందుకు రోడ్డు దాటే క్రమంలో సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న (టీఎస్ 08 యూబీ 4576) అనే నెంబర్ గల వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

- దాతల సహాయంతో దహన సంస్కారాలు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సిరిసిల్ల అర్బన్ : తంగళ్లపల్లి మండలం.. టెక్స్‌టైల్ పార్క్‌కు చెందిన బాబు (32) అనారోగ్యంతో మృతిచెందాడు. బాబు తల్లిదండ్రులతో కలిసి ఉంటుండగా గతేడాది నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. తమను పోషిస్తాడనుకున్న కొడుకు మృతిచెందడంతో వృద్ధ దంపతులు కన్నీటి పర్యంతమయ్యారు. దహన సంస్కారాలకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో స్థానికులు, పలువురు దాతల సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు.

పెళ్లిళ్ల పేరుతో మోసం



మేటి శివకుమార్

వేములవాడ : పెళ్లిళ్ల పేరుతో మోసం చేస్తున్న మేటి శివకుమార్ అనే వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా.. తాటిపల్లికి చెందిన అంకం లక్ష్మణ్ అనే వృద్ధుడి భార్య మృతిచెందగా ఒంటరిగా ఉంటున్నాడు. దీనిని ఆసరాగా చేసుకున్న శివకుమార్ ఓ అమ్మాయితో వివాహం జరిపించాడు. లక్ష్మణ్ వద్దనుంచి డబ్బులు తీసుకుని మోసం చేశాడు. లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శివకుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

తీర్థయాత్రకు వెళ్లొచ్చేసరికి..

- 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 వేలు చోరీ
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



బీరువాలోని వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు

ముస్తాబాద్ (సిరిసిల్ల): తీర్థయాత్రలకు వెళ్లొచ్చేసరికి ఓ ఇంట్లో చొరబడి 3 తులాల బంగారు ఆభరణాలు, నగదు చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన పారిపెల్లి వేణు గతనెల 23న కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లారు. మంగళవారం ఇంటికి రాగా ఇంటితాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.2వేల నగదు అపహరణకు గురైనట్లు తెలుసుకొని వేణు పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాపరామకృష్ణ

వేములవాడఅర్బన్: హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. మండలంలోని సంకెపల్లిలో మంగళవారం ప్రజాగోస..బీజేపీ భరోసా కార్నర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బుర్ర లహరిక, బుర్ర శేఖర్ గౌడ్, నాగుల సురేశ్, నాగరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదాం



మాట్లాడుతున్న జీవిత

వేములవాడరూరల్: అవినీతి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో సాగనంపాల్సిన సమయం వచ్చిందని బీజేపీ సీనియర్ నాయకురాలు, సినీనటి జీవిత అన్నారు. వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి ప్రజాగోస.. బీజేపీ భరోసా కార్నర్ ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేశారని, మన రాష్ట్రాన్ని తాగుబోతు రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎందే అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వమే ఏర్పడుతుందని, ఇప్పటి నుండే పార్టీ నాయకులు, కార్యకర్తలు గడప గడపకూ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని వివరించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్, ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, దళిత మోర్చా రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్, గోపు బాలరాజు, సత్తయ్య, అల్లాడి రమేష్, రవికిషోర్, జక్కుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ అవయవదానం



స్వప్న (ఫైల్)

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన పానగంటి స్వప్న (45) మృతిచెందగా ఆమె అవయవాలను కుటుంబీకులు దానం చేశారు. స్వప్న నాలుగు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురికాగా చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందే ముందు భర్త నర్సయ్య సూచనల మేరకు తన రెండు కిడ్నీలు, గుండెను ఆస్పత్రి వారికి దానం చేసింది. కాగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, సర్పంచ్ మేసు ఏసుదాసు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, టీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



రాములును పరామర్శిస్తున్న గౌడ సంఘం నాయకులు

వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన నాగోలి రాములు తాటిచెట్టు పైనుంచి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాములు తాటిచెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో కిందపడిపోగా ప్రథమ చికిత్స కోసం వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా గౌడ సంఘం నాయకులు సంపునూరి మల్లేశం, చంద్రగిరి శ్రీనివాస్, బత్తిని ఎల్లగౌడ్, పర్శరాములు, కె.రాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సంక్షేమ పాలనే కాంగ్రెస్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: దేశంలో పేద ప్రజలకు సంక్షేమాన్ని అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర మార్చి 4న సిరిసిల్ల, 5న వేములవాడ నియోజకవర్గాలకు చేరుకుంటుందన్నారు. పార్టీ అధినాయకుడు రాహుల్‌గాంధీ చేపడుతున్న భారత్ జోడోయాత్ర సందేశాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడమే యాత్ర ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. యాత్ర కార్యాచరణపై నాయకులతో కలిసి చర్చించారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.